

రేవంత్ రెడ్డి ఒకే ఒక్కడు
పుస్తకాన్ని ఆవిష్కరించిన పిసిసి చీఫ్

# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 283 శుక్రవారం 8 నవంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


# నేడు యాదాద్రికి సీఎం రేవంత్



- తొలుత యాదాద్రి సందర్శన
- కుటుంబ సమేతంగా పూజలు
- అనంతరం మూసీ నది పునరుజ్జీవ సంకల్ప యాత్రకు
- వలిగొండ మండలం సంగెం గ్రామ శివారులోని భీమలింగం కత్వ నుంచి యాత్ర ప్రారంభం
- మూసీ రైతులతో సమావేశం
- పాదయాత్ర పనులను పరిశీలించిన మంత్రులు

**వలిగొండ వద్ద మూసీపునరుజ్జీవ యాత్ర ప్రారంభం**

హైదరాబాద్,నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టిన రోజును శుక్రవారం జరుపు కోనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ఆయన తన కుటుంబ సమేతంగా యాదాద్రికి వెళ్లనున్నారు. ఉదయం 8:45 గంటలకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు యాదాద్రి అధికారులతో ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం మూసి పునరుజ్జీవ ప్రజా చైతన్య పాదయాత్ర ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు వలిగొండ మండలం సంగెం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా చైతన్య పాదయాత్ర చేపడుతారు. మూసీ పరివాహక ప్రాంతంలో 6కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించనున్నారు. అనంతరం మూసి పరివాహక ప్రాంత రైతులతో సమావేశం కానున్నారు. రైతుల యోగా క్షేమాలు అడిగి తెలుసుకోనున్నారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీ చామల కిరణ్ కుమార్, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.



# కేసులకు భయపడేదే లేదు

- అనిశా జోక్యం చేసుకునేందుకు ఇందులో అవినీతి ఏముంది?
- జైల్లో పెడితే యోగా చేసుకొని ట్రిమ్ అయి వస్తా
- ప్రజల కోసం పాదయాత్ర చేస్తా లేదు :మాజీ మంత్రి కేటీఆర్
- ఆరు గ్యారంటీలు అమలుచేసేదాకా కాంగ్రెస్‌ను వదిలిపెట్టేది




హైదరాబాద్,నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త):
'ఫార్ములా ఈ-రేస్ విషయంలో నా మీద కేసులు పెడతారని ప్రచారం చేస్తున్నారు. అయినా కేసులెందుకు పెడతారు? హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా? లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చినందుకా? పారిపోతాయన్న కంపెనీలను కాపాడినందుకా? దిగ్గజ సంస్థలకు గమ్యస్థానంగా మార్చినందుకా? మీరు ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ఆరు గ్యారంటీలు అమలుచేసే దాకా వదిలిపెట్టేది లేదు. మీ ఇష్టమున్న కేసులు పెట్టుకోండి” అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. “ఓ రెండు, మూడు నెలలు జైల్లో పెట్టి ఆనందం పొందుతామంటే.. నాకేమీ అభ్యంతరం లేదు...**మిగతాది 2లో...**



# భారత్‌లో మరణశిక్ష రాజ్యాంగబద్ధమే

**మరణశిక్షపై ప్రశ్న... ‘ఏఐ’ లాయర్ సమాధానంతో ఆశ్చర్యపోయిన సీజేఐ**

**ఢిల్లీలో నేషనల్ జ్యుడిషియల్ మ్యుజియంను ప్రారంభించిన సీజఐ చంద్రచూడ్**

**అక్కడి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాయర్‌కు మరణశిక్షపై ప్రశ్న**

2లో.



# 11 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

- పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లుగా పరిస్థితి
- ధాన్యం కొనే దిక్కులేక రైతుల అవస్థలు
- దళారుతలో కుమ్మక్కయిన మిల్లర్లు
- సంస్థాగతంగా బిజెపి బలోపేతం చేయాలి
- ప్రజల సమస్యలపై ఎక్కడిక్కడ పోరాటాలు
- పార్టీ కార్యశాలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




హైదరాబాద్నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలో 11 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారని వివరించారు. అలాగే ఆరు గ్యారెంటీల అమలులో విఫలం అయ్యారని అన్నారు. సంస్థాగతంగా భాజపాను బలోపేతం చేసుకోవాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై కార్యశాల నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు, రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయని చెప్పారు. భాజపాకు సంస్థాగత ఎన్నికల వ్యవస్థ ఊపిరి అని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. మహిళ, యువత, రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సంస్థాగత ఎన్నికలకు తెలంగాణ బీజేపీ సిద్ధం అవుతుంది.. ఈ నెల 15 వరకు సభ్యత్వ సేకరణ కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.**మిగతాది 2లో...**



# బెంగళూరుకు హైడ్రా అధికారులు

**బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ, విపత్తు నిర్వహణపై అధ్యయనం**

**రెండు రోజుల పాటు బెంగళూరులో పర్యటించనున్న హైడ్రా అధికారులు**

హైదరాబాద్,నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త):
హైడ్రా కమిషనర్ రంగనాథ్ బెంగళూరుకు వెళ్లారు. బెంగళూరులోని చెరువుల పునరుద్ధరణ, విపత్తు నిర్వహణపై హైడ్రా అధికారులు అధ్యయనం చేయనున్నారు. ఇందుకోసం హైడ్రా అధికారులు నిన్ననే కర్ణాటక రాజధానికి చేరుకున్నారు. ఈరోజు రంగనాథ్ బెంగళూరుకు చేరుకున్నారు. చెరువుల పరిరక్షణ, విపత్తు నిర్వహణపై కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు **మిగతాది 2లో...**

## అరాచకాలు బయటపడుతుంటే

# భయం పట్టుకుంది

- భుజాలు తడుముకుంటున్న కెటిఆర్
- చట్టం తనపని తాను చేసుకు పోతుంది
- రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం
- తొర్రూరు మార్కెట్ కమిటీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి



మహబూబాబాద్ నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త):
‘గుమ్మడి కాయల దొంగ అంటే.. భుజాలు ఎందుకు తడుముకుంటున్నవ్ కేటీఆర్..?‘ అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్.. నువ్వు చేసిన తప్పేంటో నీకు తెలుసు.. పడబోయే శిక్ష ఏంటో నీకు తెలుసు‘ అని అన్నారు. 11 నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అన్నారు. గురువారం తొర్రూర్ వ్యవసాయ నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడుతూ..**మిగతాది 2లో...**

# 18 నుంచి బిసి కమిషన్ బహిరంగ విచారణలు

## కమిషన్ దృష్టికి వచ్చిన అంశాలపై నివేదిక



హైదరాబాద్,నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్రంలో వెనుకబడిన కులాల స్థితిగతులు తెలుసుకునేందుకు బీసీ కమిషన్ ఈ నెల 18వ తేదీ నుంచి బహిరంగ విచారణలు తిరిగి ప్రారంభించనుంది. తొలుత అక్టోబరులో జారీ చేసిన షెడ్యూలు ప్రకారం అక్టోబరు 28 నుంచి నవంబరు 13 వరకు ఉమ్మడి జిల్లాలు, కమిషన్ కార్యాలయంలో అన్ని వర్గాలతో విచారణలు నిర్వహించాల్సి ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ వేసింది. అయితే, అప్పటికే బీసీ కమిషన్ ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో బహిరంగ విచారణలు పూర్తిచేయగా... మిగిలిన జిల్లాల్లో ఈ ప్రక్రియను నిలిపివేసింది. తాజాగా నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు విచారణలు నిర్వహించాలని నిర్ణయించింది. బహిరంగ విచారణ సమయంలో కమిషన్ దృష్టికి వచ్చిన వివిధ అంశాలను ప్రభుత్వానికి తెలపనుంది. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించి, తమ వివరాలు నమోదు చేయాలని కమిషన్ కోరింది. నిజామాబాద్ జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీలు బీసీ కులాల వారిని సామాజికంగా బహిష్కరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ కమిషన్ పేర్కొంది. ఆ కమిటీలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి లేఖ రాయనుంది. బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపైనా చర్యలు తీసుకోవాలని కోరనుంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి గత, ప్రస్తుత కమిషన్లు చేసిన అధ్యయన వివరాలను కొత్తగా ఏర్పాటైన ప్రత్యేక కమిషన్ తెలుసుకుంది. పొరుగు రాష్ట్రాల కమిషన్లు.. రిజర్వేషన్ల ను ఎలా ఖరారు చేశాయి? ప్రస్తుత పరిస్థితులు, ఇతర వివరాలు అడిగింది.

# అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

## - శంకుస్థాపనలు చేసిన రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

వరంగల్ బ్యూరో, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్, వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి హాజరై సుమారు 52.34 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాయపర్తి మండలంలోని పెరికేడు గ్రామం నుండి అన్నారం షరీఫ్ వరకు
7 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. వర్ధన్నపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన సభ వద్ద సుమారు 50.84 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. అందులో భాగంగా అమృత్ 2.0 పథకం కింద 34.08 కోట్ల రూపాయల వ్యయంతో వర్ధన్నపేట మంచినీటి సరఫరా ప్రాజెక్ట్ పనులను ప్రారంభించారు. ఇల్లంద నుండి జగ్గయ్య గూడెం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు, చెన్నారం నుండి ఆశాలపల్లి వరకు నిర్మించే రోడ్డు పనులు, సిఎస్ఆర్ కింద వర్ధన్నపేట సిహెచ్ సి హాస్పిటల్ అభివృద్ధి పనులు, చెన్నారం నుండి పంథిని వరకు అభివృద్ధి పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మార్పు కావాలని, అది ఇందిరమ్మ రాజ్యం తోనే సాధ్యమని, కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్ర ప్రజలు తీర్పు ఇచ్చారని తెలిపారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 11 నెలల్లో చేసి చూపించామన్నారు. చెప్పిన అంశాలతో పాటు చెప్పనిఅనేక కార్యక్రమాలు చేస్తూ, అభివృద్ధి,



సంక్షేమం రెండు కళ్ళలా అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో 7.19 లక్షల కోట్ల అప్పు ఉన్నను మంత్రి సారథ్యంలో దృఢ సంకల్పంతో ఎలాంటి రాజకీయ స్వార్థం లేకుండా, రైతునే రాజు చేయాలని సంకల్పంతో అర్హులైన రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, 27 రోజుల్లోనే 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని చెప్పారు. ఇంక మిగిలి ఉన్న 13 వేల కోట్ల రూపాయలు డిసెంబర్ చివరిలోగా అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. దానికి తోడుగా అర్హులైన మరో రెండు మూడు వందల మంది రైతులకి రుణమాఫీ చేస్తామన్నారు. రైతు బంధును ప్రభుత్వం త్వరలోనే అర్హులకు అందజేస్తుందని మంత్రి తెలిపారు. గడిచిన 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో లక్ష 52 వేల ఇల్లు మంజూరు కాగా 87 మాత్రమే నిర్మించారని, మిగిలిన 65 వేల ఇల్లు మొండి గోడలతో అసంపూర్తిగా నిర్మాణం చేశారని చెప్పారు. వాటిని ఇందిరమ్మ ప్రభుత్వం తర్వాత నిర్మించి అర్హులకు అందజేయడం జరిగిందన్నారు. 20 లక్షల గృహాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అందులో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున నిర్మించి, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా గ్రామసభల ద్వారా అర్హులకు అందజేస్తామన్నారు. వరి ధాన్యం విషయానికొస్తే సన్న రకం వడ్లకు రైతులకు క్వింటాకు 500 రూపాయలు చొప్పున ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. త్వరలో ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డులు అందజేస్తామని ప్రభుత్వ ప్రతి సంక్షేమ ఫలాలు ఆ కార్డు ఆధారంగానే అందజేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నాను ఇచ్చిన హామీల్లో కొన్ని అమలు చేశామని తెలిపారు. మిగిలిన వాటిని కూడా తూచా తప్పకుండా నెరవేర్చుతామని మంత్రి స్పష్టం చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కోరిన విధంగా చెరువు బండ్, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు 200 మంది ఔట్ పేషెంట్ వస్తారని కోరిన మేరకు హాస్పిటల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ సందర్భంగా నియమింపబడిన వర్ధన్నపెట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఉపాధ్యక్షులు కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు వారిని సన్మానించారు.









### కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాయపర్తి మండలం పెరికేడ్ గ్రామంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

### రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరుద్యోగులకు ఆసరాగా ఉంటూ ఉద్యోగాలు కల్పించడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని ఖచ్చితంగా నిలబెట్టుకోవడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు మెస్ చార్జీలను 40 శాతం పెంచామన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో అధిక తండాలు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయాలన్నారు.ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున నిర్మించి, అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామన్నారు.

### వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య

డాక్టర్ గా పనిచేసిన వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు 200 మంది అవుట్ పేషెంట్ వస్తారని వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య అన్నారు. 24 గంటలు ఆసుపత్రి పని చేసేలా అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు.

### ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

అమృత్ 2.0 పథకం అభివృద్ధి పనుల ద్వారా నగరానికి మంచినీటి సమస్య తీరుతుందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఉన్న మామునూరు ఎయిర్పోర్ట్ ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో మంత్రి పొంగులేటి విశేష కృషి కారణంగా త్వరలో ఏర్పోర్ట్ సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ మార్నేని రవీందర్ రావు,
ఇంచార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, నీటిపారుదల, వైద్య ఆరోగ్య సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేసులకు భయపడేదే లేదు

(మొదటి పేజి తరువాయి)

మంచిగా పోతా. యోగా చేసుకొని ట్రిమ్ అయి వస్తా. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర చేస్తా" అన్నారు. 'అవినీతి జరిగితే అనిశాను వాడాలి. కానీ, ఇక్కడ అవినీతి ఏముంది? నాకు వచ్చింది ఏముంది? రోజుకో రకంగా ప్రచారం చేస్తున్నందుకే.. మొత్తంగా ఏం జరిగిందో నేనే ప్రజలకు చెబుతున్నా' అని కేటీఆర్ వివరించారు.
'దేశానికి ఫార్ములా 1 రేస్ రావాలన్న కల ఈనాటిది కాదు. 2003లో చంద్రబాబు హయాంలో హైదరాబాద్‌లో నిర్వహణకు ప్రయత్నించినా అప్పట్లో సాధ్యపడలేదు. ఆయన చేయలేని పనిని మేం చేసి చూపించాం. విత్తనం ఈ రోజు పెడితే.. చెట్టు ఐదేళ్లకో, పదేళ్లకో, ఇరవై ఏళ్లకో మొలవొచ్చు. చంద్రబాబు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేశారు. ఇప్పుడు ప్రపంచంలోనే మూడోవంతు వ్యాక్సిన్లు ఇక్కడే తయారవుతున్నాయి. అదే విధంగా ఫార్ములా-ఈని ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 49 కోట్ల మంది చూస్తారు. ఈ రేస్ ద్వారా విద్యుత్ వాహనాల ఉత్పత్తికి హైదరాబాద్‌ను అడ్డాగా మార్చాలనుకున్నాం. నేను మంత్రి అయిన తర్వాత ఎఫ్ 1ను తీసుకురావడానికి ఎంతో ప్రయత్నం చేశాను. ఫార్ములా-ఈ రేస్‌లు ప్రస్తుతం లండన్, న్యూయార్క్, పారిస్, టోక్యో, మొనాకో, రోమ్, సింగపూర్‌లలో జరుగుతున్నాయి. వీటి సరసన హైదరాబాద్‌ను విశ్వనగరంగా చూడాలని లక్ష్యంగా పెట్టుకొని పోటీపడ్డాం. సియోల్, జోహెన్నెస్‌బర్గ్‌లను తలదన్ని మన హైదరాబాద్‌కు ఈ-రేస్‌ను తెటచ్చాం.
హెచ్ఎండీఏ స్వతంత్ర సంస్థ. దీనికి ఛైర్మన్ సీఎం. వైస్‌ఛైర్మన్ పురపాలకశాఖ మంత్రి. నా మీద కోపంతో.. అందులో నాకేదో వచ్చిందనుకొని ఏమీ తెలుసుకోకుండా ఈ-రేస్‌ను రద్దు చేశారు. దీంతో రాష్ట్రానికి రూ.700 కోట్ల నష్టమొచ్చింది. ఓ వైపు సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహిస్తామంటున్నారు. మరి అందుకు ఎంత ఖర్చు అవుతుందో తెలుసా? అంతర్జాతీయంగా హైదరాబాద్ పరువు తీశారు రేవంత్. నిజానికి ఎవరిపై పెట్టాలి కేసు? చేతనైతే మేఘా ఇంజినీరింగ్‌పై పెట్టండి. సుంకిశాలలో గోడ కూలిపోయింది. రూ.80 కోట్ల నష్టం వచ్చిందని మీ డిపార్ట్‌మెంటే నివేదిక ఇచ్చింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దు.. రేసు రద్దు.. ఫార్మా సిటీ రద్దు.. ఇలా చేస్తే పెట్టుబడులు వస్తాయా? ఉద్యోగాలు దొరుకుతాయా? రాజ్‌భవన్‌లో భాజపా, కాంగ్రెస్ ఒక్కటై కలుసుకున్నది వాస్తవం. భారాసను ఎలా ఖతం చేయాలా అని కుట్ర చేస్తున్నారు. గవర్నర్ విచారణకు అనుమతిస్తే.. అది ఆయనిష్టం. ఆయన విచక్షణ. నాకేమీ అభ్యంతరం లేదు. ఏ విచారణకైనా సిద్ధమే' అని కేటీఆర్ స్పష్టం చేశారు.
మేము ఈ-రేస్ కోసం ప్రభుత్వం తరపున చేసిన ఖర్చు కేవలం రూ.35-40 కోట్లు మాత్రమే. ప్రైవేటు ప్రమోటర్ గ్రీన్ కో అనే సంస్థను ఒప్పించాం. ఆ సంస్థ రూ.100-110 కోట్లు పెట్టింది. మొత్తం పెట్టిన ఖర్చు రూ.150 కోట్లు. కానీ, హైదరాబాద్‌కు ఈ రేస్ ద్వారా వచ్చిన ప్రయోజనం రూ.700 కోట్లు అని నెల్సన్ అనే సంస్థ కూడా నివేదిక ఇచ్చింది. అదే కాకుండా మొబిలిటీ వీక్‌లో పలు పరిశ్రమలను

# అరాచకాలు బయటపడుతుంటే భయం పట్టుకుంది

(మొదటి పేజి తరువాయి)

'తల తాకట్టు పెట్టయిన డిసెంబర్ లోపు 13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని అన్నారు. 'రుణమాఫీ అయ్యాక నీ తల ఏ టైర్ కింద పెడతావో ఆలోచించుకో' అని అన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరే సమయంలో కేసీఆర్‌ను తండ్రిలా భావించి కాళ్లు మొక్కానని అన్నారు. కానీ తడిగుడ్డతో గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు.తనకు నాలుగు గోడల మధ్య కాళ్లు పట్టుకొనే అవసరం లేదని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు 'పొంగులేటి హోం మంత్రా..? అలా ఎందుకు మాట్లాడుతున్నారు' అని అంటున్నారని, తాను క్యాబినెట్ మంత్రినని, అన్ని విషయాలూ మాట్లాడుతానని అన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానని అంటున్నారని, పాదయాత్ర చేస్తారో.. మోకాళ్ల యాత్ర చేస్తాడో నిర్ణయం ఆయనే తీసుకోవాలని పొంగులేటి ఎద్దేవా చేశారు. తాను ఆ పార్టీ, ఈ పార్టీ నేతలను అరెస్టు చేస్తారని ఎక్కడా చెప్పలేదని తెలిపారు. దానికి శ్రీనివాస్ రెడ్డి అదాని కాళ్లు మొక్కాడని ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తనకు చట్టం తెలుసునని, ఎప్పుడు, ఎక్కడ ఏం జరగాలో అది జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వం 7 లక్షల 19 కోట్ల రూపాయలు అప్పు చేసి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు.. ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం మీద బావ బావమరిది తప్పుడు ప్రచారు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రత్యక్షంగా రైతుల కోసం ఇప్పటి వరకు రూ. 18 వేల కోట్లు రుణమాఫీ చేశాం.. మిగతా 12 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. బావ బావమరిది తల ఎక్కడ పుట్టుకుంట్టారో అప్పుడు చెప్పుతామని అన్నారు. పేదల పక్షపాతి ప్రభుత్వం కాబట్టి రైతుబంధు కొంచెం ఆలస్యమవుతుందని మంత్రి అన్నారు. తాము ఇచ్చే స్మార్ట్ కార్డు ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకానికి అని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణిలో విదేశాల సంస్థలకు ఇచ్చిన భూమిని మళ్ళీ తీసుకొస్తున్నాం.. దేశంలో ఎక్కడ లేనటువంటి కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. తప్పు చేస్తే పేదవాడి సొమ్మును కొల్లగొడితే పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గుమ్మడికాయ దొంగ అంటే కేటీఆర్ ఎందుకు భయపడుతున్నావో చెప్పాలన్నారు. కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి అలాగే ప్రభుత్వా విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎంపీలు, బలరాం నాయక్, కడియం కావ్య పాల్గొన్నారు.

## 11 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

(మొదటి పేజి తరువాయి)

నేటితో మెంబర్ షిప్ డ్రైవ్ చివరి దశకు చేరుకుంది. బూత్ , మండల, జిల్లా కమిటీల ఎన్నికలపై మార్గనిర్దేశర నిర్వహించేందుకు సిద్దమైంది బీజేపీ. బూత్ కమిటీ ఎన్నికల షెడ్యూల్ పై చర్చ నిర్వహిస్తున్నారు ఈ నెల 15 నుండి 25 వరకు బూత్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర , జిల్లా రిటర్నింగ్ అధికారుల నియామకం జరిగిన విషయం తెలిసిందే. తెలంగాణలో బీజేపీ సభ్యత్వం సుమారు 31 లక్షలు దాటిందని అంచనా వేస్తున్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ మాత్రం ప్రజాస్వామ్యంగా ముందుకు వెళ్తుంది? ఎవరైనా పార్టీ లో అధ్యక్షులు కావొచ్చన్నారు. ఇకపోతే తెలంగాణ పరిస్థితి పెనం నుండి పొయ్యి లో పడ్డట్టు అయిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుంది. ఒక కొత్త పెన్షన్ ఇవ్వలేదని మండిపడ్డారు. అప్పులు మాత్రం విపరీతంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేయాలని కిషన్ రెడ్డి తెలిపారు. ఒక వైపు సంస్థాగత అంశాల పై దృష్టి పెడుతూనే.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. ప్రజలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు కి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లు, మధ్య దళారులతో కుమ్మక్కు అయ్యి రైతులకు నష్టం కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ పనులు మాత్రం జరగడం లేదన్నారు. ఇక్కడ ఇచ్చిన హామీలు అమలు చేసినట్టు మహారాష్ట్రలో దుర్మార్గంగా ప్రకటనలు ఇచ్చుకుంటున్నారు

## భారత్‌లో మరణశిక్ష రాజ్యాంగబద్ధమే

### మరణశిక్షపై ప్రశ్న... 'ఏఐ' లాయర్ సమాధానంతో ఆశ్చర్యపోయిన సీజేఐ

హైదరాబాద్,నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): మరణశిక్షపై తాను అడిగిన ప్రశ్నకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) లాయర్ ఇచ్చిన సమాధానంతో సీజేఐ చంద్రచూడ్ ఆశ్చర్యపోయారు. ఈరోజు ఢిల్లీలో నేషనల్ జ్యుడిషియల్ మ్యూజియంను ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి 'ఏఐ' లాయర్‌కు సీజేఐ ఓ ప్రశ్నను సంధించారు.భారత్‌లో మరణశిక్ష రాజ్యాంగబద్ధమేనా? అని సీజేఐ చంద్రచూడ్ అడిగారు.
కళ్లజోడు, టై, కోటు ధరించి... న్యాయవాది రూపంలో ఉన్న ఏఐ లాయర్ సమాధానం చెబుతూ.... అవును, మన దేశంలో మరణశిక్ష రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసింది. అత్యంత తీవ్రమైన, చాలా అరుదైన కేసుల్లో మాత్రమే మరణశిక్షను విధిస్తారని పేర్కొంది. ఏఐ లాయర్ సమాధానంతో ఆశ్చర్యపోయిన సీజేఐ, ఓ చిరునవ్వు నవ్వి అక్కడి నుంచి ముందుకు కదిలారు. ఈ నెల 11న సీజేఐగా బాధ్యతలు చేపట్టబోతున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బెంగళూరుకు హైడ్రా అధికారులు

(మొదటి పేజి తరువాయి)

హైడ్రా కమిషనర్ రంగనాథ్, అధికారులు యలహంకలోని కర్ణాటక స్టేట్ నేచరల్ డిజాస్టర్ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శిస్తారు. అక్కడ సీనియర్ శాస్త్రవేత్తలతో విపత్తు నిర్వహణపై సమావేశమవుతారు. ఆ తర్వాత సెన్సార్ సహాయంతో పర్యవేక్షిస్తున్న మురుగునీటి వ్యవస్థను పరిశీలించనున్నారు. బెంగళూరు కోర్ సిటీలో ఉన్న చెరువులను సందర్శిస్తారు.లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో రేపు రంగనాథ్ సమావేశమవుతారు. కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం-2014పై చర్చించనున్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని మార్గందోన్హళ్లీ చెరువు, ఇన్ఫోసిస్ అభివృద్ధి చేసిన చెరువులను సందర్శించనున్నారు.హైదరాబాద్‌లోని ఐదు చెరువులను పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం... హైడ్రాకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చెరువుల పునరుద్ధరణపై బెంగళూరులో అధ్యయనం చేయనున్నారు. రెండు రోజుల పాటు బెంగళూరులో అధ్యయనం చేయనున్న హైడ్రా... ఆ తర్వాత హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, విపత్తు నిర్వహణపై ముందుకు సాగనుంది.

# ఎస్సీల వర్గీకరణ జరిగేంతవరకు ఉద్యోగ నియమాకాలను ఆపి వేయాలి

- త్వరితగతిన వర్గీకరణను అమలుపరచాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు
- వర్ధన్నపేట మండల కమిటీల ఏకగ్రీవ ఎన్నిక
- వరంగల్ జిల్లా ఇన్చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ











వర్ధన్నపేట, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎంఎంఆర్ గార్డెన్లో ఎంఆర్పిఎస్, మండల కమిటీ సమావేశం నిర్వహించారు. గురువారం జిల్లా ఇన్చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పి జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బుర్ర బిక్షపతి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణ జరిగేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను ఆపివేసి, వర్గీకరణను త్వరగా అమలుపరచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వేల్పుల సూరన్న మున్నూరు కాపు ఎంఎస్పి జాతీయ నాయకులు, బొడ్డు దయాకర్ మాదిగ ఎంఎస్పి జాతీయ నాయకులు, గోలి సుధాకర్ మాదిగ వర్ధన్నపేట మండల కమిటీ, ఎర్ర సంతోష్ మాదిగ మండల అధ్యక్షులు వర్ధన్నపేట, సీనపెల్లి రాజు మాదిగ అధికార ప్రతినిధి వర్ధన్నపేట, మండల ప్రధాన కార్యదర్శిబిర్రు ప్రభాకర్ మాదిగ, మండల ఉపాధ్యక్షులు చాడా కరుణాకర్ మాదిగ, మండల కార్యదర్శి బండౌతపురం ఉదయ్ మాదిగ, ఎంఎస్పి మండల కమిటీముత్యాల మల్లేశం మాదిగ, ఎంఎస్పి వర్ధన్నపేట మండల అధ్యక్షులు బిర్రు బిక్షపతి మాదిగ, ఎంఎస్పి వర్ధన్నపేట అధికార ప్రతినిధి, మాదిగ యువసేన కమిటీమైదం రంజిత్ మాదిగ, వర్ధన్నపేట మండల అధ్యక్షులు గడ్డం కుమారస్వామి మాదిగ, వర్ధన్నపేట మండల అధికార ప్రతినిధి ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షులు బిర్రు రమేష్ మాదిగ లను కమిటీలు ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులుగా భాస్కుల రాజు మాదిగ, రడపాక భరత్ మాదిగ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారిని రాష్ట్ర, జిల్లా నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా వారి ఎన్నికకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులైంది

- ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్న రైతులు - ప్రైవేట్ వ్యక్తులకు రైతులు అమ్ముకుంటున్నారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



వర్ధన్నపేట, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం రాందాన్ తండలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం కొనుగోలు కేంద్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి రైతులు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. పండించిన పంటకు ఈ ప్రభుత్వం 500 బోనస్ ఇవ్వకపోగా, కనీసం మద్దతు ధర కూడా ఇవ్వడంలేదని దయాకర్ రావు విమర్శించారు. ఈ ప్రభుత్వం రైతులకు ఎలాంటి సహాయం చేయకపోగా, ఉన్నవాటిని తీసేస్తుందని అన్నారు. రైతుబంధు బంధు పెట్టి, రుణమాఫీ ఎగ్గొటిందన్నారు. ఇక ఈ ప్రభుత్వంపై రైతులకు నమ్మకం పోయి, చేసేది ఏమీ లేక వారు పండించిన పంటలను ప్రైవేట్ వ్యక్తులకు రైతులు అమ్ముకుంటున్నామని బాధిత రైతులు మాట్లాడుతున్నారు. కొనుగోలు సెంటర్ ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నప్పుడు ఇప్పటివరకు ఒక్క గింజ కొనడం లేదని మాజీ మంత్రికి రైతులు వారి గోడును వెళ్ళబోసుకున్నారు. వడ్లకొనుగోలులో అప్పటి ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. ఈ ప్రభుత్వం తడిసిన ధాన్యమని, తేమ శాతం ఉందని అన్ని కొర్రిలు పెట్టి కనీసం ఇప్పటి వరకు వరి కొనుగోలు సెంటర్లు ప్రారంభించకపోవడం దురదృష్టకరం అన్నారు. ఈ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తుందని దయాకర్ రావు విమర్శించారు. వడ్లు ఆరబోసి ప్రైవేట్ వాళ్ళకి అమ్ముకుంటేనే ఎక్కువ లాభం వస్తుందని రైతులు అనిమిరెడ్డి రాజమల్లయ్య, ప్రవీణ్ రైతులు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వరి కల్లాలను మంత్రి పరిశీలిం హారు. పండిన ప్రతీ గింజ కోనేవరకు ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కచ్చితంగా పండిన ప్రతి గింజ కొనాలి, మద్దత్తు ధరతో పాటు బోనస్ ఇవ్వాలి, పూర్తిస్థాయిలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పార్టీ నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాత రంగారావు లేకపోవడం పార్టీకి తీరని లోటు

- తెలుగుదేశం పార్టీ నాయకులు వాసిరెడ్డి రామనాథం



వైరా, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): వైరా మండలం తాటిపూడి గ్రామానికి చెందిన మాజీ టీడీపీ నాయకులు, సొసైటి మాజీ అధ్యక్షులు స్వర్గీయ తాతా రంగారావు పెద్దకర్మ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గురువారం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని టిడిపి నేతలు పెద్దకర్మ కార్యక్రమానికి హాజరైనారు. ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తాతా రంగారావు చిత్రపటానికి వద్ద శ్రద్ధాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాతా రంగారావు స్వర్గీయులు కావడం పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన పార్టీ బలోపేతం కోసం ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఎలాంటి రాజకీయ పరిణామాలు ఎదురైనప్పటికీ, ఆయన ప్రయత్నాలు ఎప్పుడు ఆపివేయకుండా, పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన నాయకులని కొనియాడారు. వారి వెంట ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ మాజీ చైర్మన్ పూతుంబాక కృష్ణప్రసాద్, సంక్రాంతి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

- మాజీ ఎమ్మెల్యే కృషితో పూర్తయిన నిర్మాణ పనులు



సత్తుపల్లి, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): గత 46 సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రి 100 పడకల ఆసుపత్రిగా రూపాంతరం చెందింది. గతంలో ఆసుపత్రి భవన నిర్మాణం శిథిలావస్థకు చేరుకుంది. గత %శ్రీ%ప్రభుత్వ పరిపాలన సమయంలో ఎమ్మెల్యే వెంకట వీరయ్య ఆసుపత్రి నూతన భవనం మంజూరు చేయాలని కృషి చేశారు. దీంతో గత ప్రభుత్వం 34 కోట్ల వ్యయంలో పునః నిర్మాణ పనులకు మంజూరు చేసింది. ఆస్పత్రిని 1,28,356 చదరపు అడుగుల విస్తీర్ణంలో 3 అంతస్తుల్లో నిర్మాణం చేపట్టారు. 100 మందికి ఒకేసారి ఆక్సిజన్ అందించేలా ఏర్పాట్లు చేశామని మాజీ ఎమ్మెల్యే వివరించారు. స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఆస్పత్రి పనులను తరితగతిన పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆసుపత్రి నూతన భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

# ఎల్లమ్మదేవి ఆలయ పనుల పరిశీలన

- కార్యనిర్వణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు



ఐనవోలు, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): మల్లికార్జున స్వామి దేవస్థానం ఆవరణలో ఎల్లమ్మదేవి ఆలయ పనుల కొనసాగుతున్నాయి. గురువారం మల్లన్న దేవాలయ కార్యనిర్వణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు నిర్మాణ పనులను పరిశీలించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం వారి ప్లాన్స్ అండ్ ఎస్టిమేట్స్ ప్రకారంగా దేవాదాయ శాఖ స్థపతి సూచనల ప్రకారంగా హైదరాబాద్ కు చెందిన దాత పర్శ సర్వేశ్వర్ రావు యాదవ్ సుమారు 30 లక్షల వ్యయంతో ఎల్లమ్మ దేవాలయ నిర్మాణం చేయిస్తున్నారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారి వెంట అకౌంటెంట్ అద్దంకి కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న ఇదొరకం నాటకం

- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి



వర్ధన్నపేట, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): కులగణనపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, కాలయాపన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కులగనన చేపట్టి, ప్రజలను మభ్యపెడుతుందని గురువారం బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ మతం, కులమేంటో చెప్పాలని విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు చేసిన బీసీ డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన 21 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన ద్వారా కాలయాపన చేస్తోందని విమర్శ చేస్తున్నారు. కులగణన ద్వారా బీసీలకు ఏవిధంగా న్యాయం చేస్తారో చెప్పాలన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం బీసీ రిజర్వేషన్ల అమలుకు 50 శాతం నిబంధనలు ఉన్నాయని చెప్పి, తప్పించుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసి తీరాల్సిందే అన్నారు. 42 శాతం బీసీలకు ఇవ్వాల్సిన రిజర్వేషన్లలో, మైనార్టీలకు రిజర్వేషన్లు ఇచ్చి కాంగ్రెస్ బీసీలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాంటిది మైనార్టీల రిజర్వేషన్లు ఎత్తివేయకుండా బీసీలను కుల గణన పేరుతో మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కుల గణన సందర్భంగా గ్రామాల్లో మతాలు మారిన వారిని ఏ విధంగా గుర్తిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కుల గణన పేరుతో వ్యక్తుల, వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారి రాజకీయ నేపథ్యం, వృత్తి వ్యాపార నేపథ్యాలను సేకరించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తులకే సంక్షేమ పథకాలను అందజేస్తారా? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం చేపడుతున్న కులగనన శాస్త్రీయంగా జరిగి, మతాలు మారిన వారిని గుర్తించి, వారికి రిజర్వేషన్లు చెందకుండా బీసీలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# వినియోగదారులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాలి
- జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఖమ్మం జిల్లా చైర్మన్ కంటే కేశవ గౌడ్



ఖమ్మం, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): ఖమ్మం జిల్లా పరిధిలోని హెూటళ్ళు, రెస్టారెంట్లలో వినియోగదారులకు నాణ్యమైన భోజనం అందించాలని జాతీయ వినియోగదారుల హక్కు కమిషన్ ఖమ్మం జిల్లా చైర్మన్ కంటే కేశవ్ గౌడ్ అన్నారు. గురువారం సత్తుపల్లిలోని పలు హెూటళ్ళు, రెస్టారెంట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేశవ్ గౌడ్ మాట్లాడుతూ కొన్ని హెూటల్లు, రెస్టారెంట్లు అపరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. వాటి వల్ల రోగాలు వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. అదేవిధంగా రెండు మూడు రోజులుగా ఫ్రిడ్జ్ లో నిల్వపెట్టిన పదార్థాలను ప్రజలకు పెట్టకుండా, ఎప్పటికప్పుడు నాణ్యమైన నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అదేవిధంగా ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారులు కూడా ఎప్పటికప్పుడు హెూటల్, రెస్టారెంట్లను తనిఖీ చేయాలని అన్నారు. నిబంధనలను పాటించని యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అటువంటి హెూటలను, రెస్టారెంట్లను తక్షణమే సీజ్ చేయాలని కోరారు. వారు పరిశీలించిన హెూటళ్ళు, రెస్టారెంట్లలో అపరిశుభ్రంగా ఉన్న వాటిపై సంబంధిత జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

# రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి

- అభినందించిన పాఠశాల ఉపాధ్యాయులు



చెన్నారావుపేట, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ ఓ సిటీలో నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జిఎఫ్ఐ) అండర్ 17 ఖోఖో బాల బాలికల పోటీలలో చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి రెడ్డబోయిన కీర్తన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 8,9,10 తేదీలలో ఖమ్మం జిల్లాలో జరుగుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో కీర్తన అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థి కీర్తనను,ఉప్పరపల్లి విద్యార్థులు క్రీడారంగంలో ముందంజలో ఉండడానికి కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్న కృషిని హెచ్ ఎం జయ మరియు ఉపాధ్యాయులు ఎస్ సునీత, పిన్నింటి బాలాజీ రావు, ఉదయ్ కుమార్, సిహెచ్ మాధవి,ఎల్ మొగిలి, కె.మాధవి, వర్థెల్లి సతీష్ కుమార్,హంస రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జాహెద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర అభినందించారు.

# ఓరుగల్లు వాసుల కల త్వరలో నెరవేరబోతుంది

- అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ గా మామునూరును తీర్చిదిద్దే దిశగా అడుగులు
- ప్రయాణికులు సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ప్రణాళికల రూపకల్పన
- వరంగల్ ఎయిర్ పోర్టును తేవడంలో సీఎం రేవంత్ రెడ్డి విశేష కృషి
- అన్ని వసతులతో వరంగల్ నగరాన్ని రాష్ట్ర రెండవ రాజధానిగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎయిర్ పోర్ట్ సర్వీసులను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళిక వేగవంతం
- కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ పక్కనే ఉన్నందున ఎయిర్ పోర్ట్ సర్వీసులు ప్రారంభమైతే
- వరంగల్ ప్రగతిలో దూసుకుపోతుంది
- యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి
- ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి భూములు అప్పగించేందుకు అంగీకరించిన రైతులకు కృతజ్ఞతలు
- ఎయిర్ పోర్ట్ కు భూసేకరణ నిమిత్తం రైతులు, స్థానికులతో చర్చించిన మంత్రి కొండా సురేఖ



వరంగల్ బ్యూరో, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): మామునూరు ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు సంబంధించిన భూ సేకరణ నిమిత్తం గురువారం ప్రజా ప్రతినిధులు స్థల పరిశీలన చేశారు. అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ, వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి స్థల పరిశీలనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలోని గాడిపల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామస్తులతో మంత్రి సమావేశమై విమానాశ్రయ ఏర్పాటుకు కావలసిన 253 ఎకరాల భూసేకరణ నిమిత్తం రైతులతో మాట్లాడారు. ఎయిర్ పోర్ట్ వస్తే స్థానిక ప్రజల జీవితాలు ఎలా మెరుగుపడతాయో సోదాహరణంగా వివరించి, వారిని ఒప్పించారు. ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు తమ అమూల్యమైన భూములు అప్పగిస్తున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. భూమి కోల్పోతున్న 233 మంది రైతులు, ప్లాట్ల యజమానులతో చర్చించి, వారి అభిప్రాయాల మేరకు ఇతర భూమి కేటాయించి, వారు కోరిన విధంగా మౌలిక సదుపాయలైన రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, ఇతర సదుపాయాలను కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ హైదరాబాద్ కు ధీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ ఉందని మంత్రి సురేఖ పునరుద్ఘాటించారు. వరంగల్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వరంగల్ విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెస్తామని మంత్రి స్పష్టం చేశారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప తోపాటు, భద్రకాళి 1000 స్తంభాల ఆలయం, వరంగల్ కోట కాకతీయ కట్టడాలు, మెగా టెక్స్ టైల్ పార్క్ అవసరాలు, భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మామునూరు ఎయిర్ పోర్ట్ ను అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రయాణికుల సర్వీసులతోపాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్ పోర్టు అభివృద్ధి చేస్తామన్నారు. హైదరాబాద్ విమానాశ్రయానికి 150 కి.మీల దూరంలో మరో వాణిజ్య విమానాశ్రయం ఏర్పాటు నిబంధనల మేరకు కుదరదని చెప్పినా, సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని, జిఎంఆర్ సంస్థను ఒప్పించి, మామునూరు ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు మార్గం చూపిన సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి సురేఖ కృతజ్ఞతలు తెలిపారు.

## వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య



చారిత్మాత్మక వరంగల్ నగరాన్ని అన్ని రంగాల అభివృద్ధి చేయుటకు ముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ముఖ్యంగా విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారని తెలిపారు.ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా సరైన రవాణా వ్యవస్థ ఉండాలని, విమానాశ్రయం ఏర్పాటుతో వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. దీనితోపాటు నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్వే లైన్ల ఏర్పాటు జరుగుతున్నదని అన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు రైతులు అమూల్యమైన భూమిని త్యాగం చేయడం సంతోషదాయకమని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి ద్వారా కావలసిన నిధులు మంత్రి కొండా సురేఖతో కలసి మంజూరు చేయిస్తామని చెప్పారు.

## భూములు అప్పగించేందుకు అంగీకరించిన రైతులకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సురేఖ

ఎయిర్ పోర్టు ఏర్పాటుకు భూములు అప్పగించేందుకు ఒప్పుకున్న రైతులు, స్థానిక ప్రజలకు మంత్రి సురేఖ కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించేందుకు కావలసిన నిధులు, రైతులకు కేటాయించే స్థలాలను పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేసి, మౌలిక సదుపాయాల కల్పనకు, పరిహారం చెల్లింపుకు, సమగ్ర నివేదికను రూపొందించి, మంజూరి నిమిత్తం ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్ ను మంత్రి సురేఖ ఆదేశించారు.

## వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో విమానాశ్రయం, రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్, నగర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటుతో అభివృద్ధిలో వరంగల్ రూపురేఖలు మారబోతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఏర్పోర్ట్ ఏర్పాటు కావడం తలమానికమన్నారు. సహకరించి ఏర్పాటుకు భూములప్పగిస్తున్న రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. భూములు కోల్పోతున్న వారికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం చూసుకుంటుందని హామీ ఇచ్చారు.

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



విమానాశ్రయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సహకరించి భూములను ఇస్తున్న రైతులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు సంతృప్తి పరిచి, వారి అంగీకారం మేరకు ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టంగా ఆదేశించారని చెప్పారు. మంత్రి కొండ సురేఖ సారధ్యంలో రైతులు సహకరించి, ఎయిర్పోర్ట్ నిర్మాణానికి తమ భూములను ఇస్తున్న రైతులకు సరైన న్యాయం జరిగేలా, మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని అన్నారు.

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



భూమి సర్వేచేసి పూర్తిగా మ్యాపింగ్ చేస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అన్నారు. ప్రస్తుతమున్న ధరలు, కోరుతున్న ధరలు, కావాల్సిన నిధులతో కూడిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, ఈదురు అరుణ విక్టర్, చింతాకుల అనిల్, సురేష్ జోషి, బైరబోయిన ఉమా దామోదర్, భోగి సువర్ణ సురేష్, ముష్కమల్ల అరుణ సుధాకర్, ఓని స్వర్ణలత భాస్కర్, సోమిశెట్టి ప్రవీణ్, పల్లం పద్మ రవి, పురా?న్, ఆర్ అండ్ బి, ఎస్ సి, నాగేందర్ రావు, ఈఈ జితేందర్ రెడ్డి, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్ రావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు



రాయపర్తి, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వర్ధన్నపేట పరిధిలో గురువారం మండలంలోని జయరాం తండ,సుభాష్ తండ, జేతురాం తండ గ్రామ పరిసరాలలో నాటు సారాయి కేంద్రాలపై వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. 10 లీటర్ల నాటు సారాయి, 850 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు మూడు కేసులు నమోదు చేయడం జరిగిందని సిఐ స్వరూప తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ సరిత, ఎక్సైజ్ సిబ్బంది టీ వెంకటేష్,పి రమేష్ బాబు,రమేశ్ బాబు వంశి తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన

**ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్**



తల్లాడ, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): రామానుజవరం, తల్లాడ, అంజనాపురం గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రాలను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర పౌరసరఫరా సంస్థ సన్న రకం వరి ధాన్యం పండించిన రైతులకు ప్రోత్సాహకంగా క్వింటాకు 500 రూపాయలు బోనస్ గా ప్రకటించడం జరిగిందని అన్నారు. ఏ గ్రేడ్ (సన్న రకం) క్వింటాకు 2320, కామన్ గ్రేడ్ (దొడ్డు రకం) క్వింటాకు 2300 రూపాయలుగా రైతన్నలకు వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కేంద్రాల్లో వడ్లు విక్రయించి రైతులు అధిక లాభాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎండిఓ, వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ డైరెక్టర్లు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ, కాప సుధాకర్, వైరా మాజీ మార్కెట్ చైర్మన్ దుండేటివీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ దగ్గులు రఘుపతి రెడ్డి, రాయల రాము, బిల్లుపాడు రామ్ అప్పారావు,పొన్నం కృష్ణయ్య, బండిబాలశౌరి, రమేష్, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

**- ప్రమాణ స్వీకారం చేపించిన మంత్రి పొంగులేటి**

**- కష్టానికి ప్రతిఫలం దక్కింది**



వర్ధన్నపేట, నవంబర్ 7,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన నరుకుడు వెంకటయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ,పౌర సమాచార శాఖల మంత్రి,వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కలెక్టర్ సత్య శారద,ఎంపీ కడియం కావ్య,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ల సమక్షంలో మార్కెట్ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేపించారు.ఈ సందర్భంగా నూతన పాలక వర్గ సభ్యులకు మంత్రి పొంగులేటి పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఎంతోకాలంగా సంవత్సరాల తరబడి కాంగ్రెస్ పార్టీ జెండాను పట్టుకుని అనేక రకాలుగా పార్టీ బలోపేతానికి కృషి చేసే పని చేసిన సీనియర్ కార్యకర్త కష్టానికి ఫలితం దక్కిందని మార్కెట్ కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు.


## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి


రాయపర్తి, నవంబర్ 7 జర్నలిస్ట్ వార్త: అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు గా నమోదు చేసుకోవాలని తహసిల్దార్ ఏం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9, 10 తేదీలలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం 2025 క్యాంపెయిన్ ను అర్హులైన ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన వారు (లేదా) 01 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండబోయే వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని అన్నారు. బూత్ స్థాయి అధికారులు ఆయా పోలింగ్ బూత్ ల వద్ద అందుబాటులో ఉంటారు. ఓటరు వివరాలను సరిచేసుకోవడం, కొత్త ఓటరుగా నమోదుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. voters.eci.gov.in వెబ్సైట్, %Voter Helpline మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటరుగా సులభంగా నమోదు చేసుకోవచ్చని అన్నారు.

# అదిరిన 'థగ్ లైఫ్' టీజర్

లోకనాయకుడు కమల్‌హాసన్ హీరోగా దిగ్గజ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'నాయగన్' (నాయకుడు 1987) తర్వాత దాదాపు 37 ఏండ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్ లో ఈ సినిమా రాబోతుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో కమల్‌హాసన్ రంగరాయ శక్తివేల్ నాయకర్ అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. శింబు, అశోక్ సెల్వన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం జూన్ 05 2025న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి రిలీజ్ టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ టీజర్ చూస్తుంటే.. కమల్ హాసన్ విశ్వరూపం, విక్రమ్ తర్వాత మళ్లీ అలాంటి పవర్‌ఫుల్ రోల్‌లో నటించబోతున్నట్లు తెలుస్తుంది. రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను రాజ్ కమల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై కమల్ హాసన్ నిర్మిస్తున్నాడు.




# అనుష్క బర్త్‌డే స్పెషల్... ఘాటి ఫస్ట్ లుక్ రిలీజ్

టాలీవుడ్ నటి అనుష్క శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఘాటి. ఈ సినిమాకు వేదం, కంచె చిత్రాల దర్శకుడు జాగర్లమూడి కృష్ణ (క్రిష్) దర్శకత్వం వహిస్తున్నాడు. 4 ఏండ్ల నుంచి షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నేడు షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అయితే నేడు అనుష్క పుట్టినరోజు సందర్భంగా ఆమెకి శుభాకాంక్షలు తెలుపుతూ ఘాటి నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. బాధితురాలు, క్రిమినల్, లెజెండ్. అంటూ అనుష్క పోస్టర్‌ని పంచుకున్నారు. ఈ పోస్టర్‌ను చూస్తుంటే.. అరుంధతి తర్వాత మళ్లీ అలాంటి పవర్‌ఫుల్ రోల్‌లో అనుష్క నటించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా గ్లింప్స్‌ను నేడు సాయంత్రం 4.05 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కొండపోలం వంటి భారీ డిజాస్టర్ తర్వాత క్రిష్ దర్శకత్వంలో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్ తెరకెక్కిస్తుంది.

# రూ.50 లక్షలు ఇవ్వకుంటే చంపేస్తామంటూ షారూక్ ఖాన్‌కు బెదిరింపులు



బాలీవుడ్ నటుడు షారూక్ ఖాన్‌కు ఫోన్ కాల్ బెదిరింపు వచ్చింది. రూ.50 లక్షలు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించారు. తనకు బెదిరింపు కాల్ రావడంతో షారూక్ ఖాన్... బాంద్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ బెదిరింపు ఫోన్ కాల్ ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది.పోలీసులు షారుక్ ఖాన్‌కు వచ్చిన ఫోన్ కాల్స్‌ను ట్రేస్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ నుంచి ఈ బెదిరింపులు వచ్చినట్లుగా గుర్తించారు. రాయ్‌పూర్‌కు చెందిన ఫైజాన్ ఖాన్ బెదిరింపులకు పాల్పడినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. అతని కోసం గాలిస్తున్నారు.పోలీసులు నిందితుడు ఫైజాన్ ఖాన్‌కు ఫోన్ చేసినప్పుడు... తనను హిందుస్థానీ అని పిలవాలని చెప్పినట్లుగా మీడియాలో వార్తలు వస్తున్నాయి. నవంబర్ 5న షారుక్ ఖాన్‌కు ఈ బెదిరింపు కాల్ వచ్చింది. అంతకుముందు, సల్మాన్ ఖాన్‌కు కూడా బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే.

# హనుమాన్ ఆలయంలో జాన్వీ కపూర్ పూజలు





అతిలోకసుందరి శ్రీదేవి తనయ జాన్వీ కపూర్‌కు తన తల్లి మాదిరిగానే భక్తి ఎక్కువనే విషయం తెలిసిందే. ఈ విషయం ఆమె ఇటీవల కొన్ని ఇంటర్వ్యూలలో కూడా చెప్పారు. ఇంట్లో పూజలు, షూటింగ్స్ లేనప్పుడు ఆలయాలకు వెళుతుంటానని జాన్వీ కపూర్ పలుమార్లు చెప్పి ఉన్నారు. ఇదంతా తను, తన చెల్లెలు.. అమ్మని చూసే నేర్చుకున్నామని కూడా జాన్వీ వెల్లడించింది. అందుకే.. తనకు సమయం దొరికిన ప్రతిసారి తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దర్శనానికి వెళు తుంటుంది జాన్వీ. రీసెంట్‌గా కూడా ఆమె తిరుమలలో దర్శనమిచ్చింది. ఇక ఇప్పుడు హైదరాబాద్‌లో ఉన్న ఓ ఆంజనేయ స్వామి గుడిలో మెరిసింది జాన్వీ కపూర్. ఆ వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం జాన్వీ కపూర్ సౌత్‌లో బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' అనే చిత్రంలో నటించిన ఆమె.. మరో స్టార్ హీరో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన16 అనే చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికైంది. మరో రెండు, మూడు ప్రాజెక్ట్‌లు డిస్కషన్‌లో ఉన్నట్లుగా తెలుస్తోంది. వీటి కోసం హైదరాబాద్‌లోనే మకాం వేసిన జాన్వీ కపూర్.. తాజాగా హైదరాబాద్, మధురా నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించి, అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల విరామ సమయంలో తరచూ ఆలయాలను సందర్శించే జాన్వీ కపూర్ మధురా నగర్ ఆంజనేయ స్వామి గుడిని దర్శించి పూజలు నిర్వహించింది. పూజ అనంతరం అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందించారు. జాన్వీ కపూర్ ఆలయానికి వచ్చిందని తెలిసి, ఒక్కసారిగా గుడి దగ్గరకు అభిమానులు భారీగా చేరుకున్నారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు అక్కడి స్థానికులు సైతం పోటీ పడ్డారు. తనని చూడడానికి వచ్చిన వారిని జాన్వీ కూడా ఆప్యాయంగా పలకరించినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె 'దేవర' సినిమాతో టాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. రామ్ చరణ్ సరసన నటించే సినిమా కూడా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. మరో వైపు కోలీవుడ్‌లోనూ జాన్వీ ఓ సినిమాకు సైన్ చేసినట్లుగా తెలుస్తోంది. ఆ వివరాలు త్వరలోనే తెలియనున్నాయి.

# అటు విజయ్.. ఇటు దుల్కర్..


## మ్యూజిక్ డైరెక్టర్ జస్లీన్ రాయల్‌తో చేస్తున్న ప్రత్యేక మ్యూజిక్ అల్బమ్.

తెలుగు సినిమా రంగంలో విజయ్ దేవరకొండ మాస్ హీరోగా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ని సాధించాడు. వరుసగా హిట్లతో మార్కెట్‌ను పెంచుకుంటూ వస్తున్న ఈ హీరో, ఆ మధ్యకాలంలో కొంత తగ్గినా సరికొత్త ప్రయోగాలతోనే ముందుకు సాగుతూనే ఉన్నాడు. ఇక తనకి ఉన్న సినిమాలతో బిజీగా ఉండగానే తాజాగా సంగీత రంగంలోకి కూడా అడుగుపెడుతున్నాడు. అందుకు కారణం మ్యూజిక్ డైరెక్టర్ జస్లీన్ రాయల్‌తో చేస్తున్న ప్రత్యేక మ్యూజిక్ అల్బమ్. య్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్ కూడా భాగస్వామ్యం అవుతున్నారని తెలుస్తోంది. జస్లీన్ ఇటీవల ఈ ప్రాజెక్ట్ గురించి తన సోషల్ మీడియా వేదికగా కొన్ని ఫోటోలు పంచుకున్నారు. వీటిలో విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, మరియు జస్లీన్ రాయల్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ ఫోటోకు సంబంధించిన అప్డేట్ ను నవంబర్ 15న విడుదల చేయబోతున్నట్లు జస్లీన్ హింట్ ఇచ్చారు. జస్లీన్ రాయల్ తన గత సంగీత ప్రాజెక్ట్ 'హీరియే' పాటతో దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు ఆమె విజయ్ దేవరకొండతో కలిసి పనిచేయడం తెలుగు ప్రేక్షకుల్లో కొత్త అంచనాలను నెలకొల్పుతోంది. జస్లీన్ తన ఫోటోలో "నా సూపర్ స్టార్ ఫ్రెండ్ దుల్కర్ సల్మాన్‌తో గ్లోబల్ చార్ట్‌బస్టర్ 'హీరియే'ను రూపొందించాను. మీరందరూ చాలా ఆదరించారు. ఇప్పుడు మా వెనుక ఎవరున్నారు?" అంటూ ఇదివరకే ఒక ఫొటో వదిలారు. ఇక ఆ పిక్‌లో విజయ్ దేవరకొండ అని హింట్ చేశారు. ఇక తాజా అప్‌డేట్ ప్రకారం, నవంబర్ 15న విడుదల కానున్న ఈ మ్యూజిక్ ఆల్బమ్ అన్ని వర్గాల్లో ప్రేక్షకుల అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్తుందని ఆమె నమ్మకంతో చెబుతోంది. విజయ్ దేవరకొండ తన సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నప్పటికీ, మ్యూజిక్ ప్రాజెక్ట్‌లో కనిపించడం అభిమానులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ముఖ్యంగా,



జస్లీన్ రాయల్ వంటి ప్రతిభావంతురాలు సంగీతాన్ని అందిస్తుండటంతో, ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్‌తో విజయ్ దేవరకొండ తన క్రియేటివిటీని కొత్త కోణంలో ప్రదర్శించబోతున్నాడని అనిపిస్తోంది. జస్లీన్ రాయల్ మరియు దుల్కర్ సల్మాన్ వంటి ప్రతిభావంతుల కలయిక ఈ ప్రాజెక్ట్‌కి మరింత ప్రత్యేకతను జోడించనుంది. ఇప్పటికే ఈ ముగ్గురు ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరి అవుట్ ఫుట్ ఏ విధంగా క్లిక్కవుతుందో చూడాలి.

# మహేష్ నే టార్గెట్ చేసిన వైజాగ్ బ్యూటీ!



ఈ మధ్య హీరోయిన్లు అంతా నాన్నలు నేవీలో పనిచేస్తుంటే? కూతుళ్లు హీరోయిన్లు అవుతున్నట్లే కనిపిస్తుంది. ఇటీవలే శోభిత ధూళిపాళ బ్యాక్ గ్రౌండ్ అంతా బయట పడింది. అక్కినేని ఇంట కోడలిగా అడుగు పెడుతోన్న నేపథ్యంలో శోభిత కుటుంబ వివరాలన్నీ బయటకు వచ్చాయి. ఈ క్రమంలోనే తెనాలి లో పుట్టినా? పెరిగింది , చదివింది అంతా వైజాగ్ లోనేనని తేలింది. ఆమె తండ్రి వైజాగ్ లో నేవల్ ఉద్యోగి కావడం..అటుపై ముంబైకి వెళ్లడంతో? నార్త్ కల్చర్ కి అలవాటు పడిన నటిగా వెలుగులోకి వచ్చింది. తాజాగా హేమలతా రెడ్డి అనే మరో బ్యూటీ కూడా వెలుగులోకి వస్తోంది. గ్లామర్ ఫీల్డ్ లో ఈ అమ్మడు కూడా పాదరసంలా దూసుకుపోతుంది. ఇప్పటికే బుల్లితెరపై సత్తా చాటింది. పలు ప్రముఖ తెలుగు టీవీ ఛానళ్లలో యాంకర్ గా పనిచేసింది. ఫ్యాషన్ రంగంలోనూ అనుభవం ఉంది. తాజాగా వైజాగ్ విచ్చేసిన సందర్భంగా ఇండస్ట్రీలో అమ్మడు టార్గెట్ గురించి రివీల్ చేసింది. విశాఖలోనే నటన నేర్చుకున్నా. డాబాగార్డెన్స్ లో ఉంటాం. నాన్న నేవీ ఎంప్లాయ్. అమ్మ ఫైనాన్స్ వ్యాపారం. స్కూలింగ్ సెయింట్ జోసెఫ్ లో చదివాను. అటుపై ఆంధ్రా యూనివర్శిటీలో ఎంఏ క్లాసికల్ చేసా. నాన్న నన్ను న్యూస్ రీడర్ గా చూడాలనుకున్నారు. ఆయన కోసం టీవీ-9, ఎన్టీవీల్లో పనిచేసా. ఆ తర్వాత కొన్ని సీరియల్స్ చేసాను. దాదాపు 20 సీరియల్స్ లో నటించాను. గతంలో వైజాగ్ బిగ్ ఎఫ్ ఎంలో జాబ్ కోసం ట్రై చేసా. ఇప్పుడు వారు నా ఇంటర్వ్యూ అడగడం ఎంతో సంతోషంగా ఉంది. టాలీవుడ్ లో సూపర్ స్టార్ మహేష్ తో నటించాలన్నది నా డ్రీమ్. ఆ ఛాన్స్ కోసం ప్రయత్నాలు చేస్తున్నా. సౌందర్య, సమంతలను అభిమానిస్తా. తెలుగు హీరోయిన్లు అంజలి, వైష్ణవి ఇండస్ట్రీలో బాగా సక్సెస్ అయ్యారు. వారిలాగే నేను కూడా అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నా. నాకు సొంతంగా వీరభద్ర క్రియేషన్స్ అనే బ్యానర్ కూడా ఉంది. 2017లో దాన్ని స్థాపించానుఅని అన్నారు.